# ఇండియన్ పాలిటీ

## భారత రాజ్యాంగ ప్రవేశిక, ప్రాథమిక హక్కులు

**నిబంధన 17 ప్రకారం అస్పృశ్యత లేదా అంటరానితనాన్ని నిషేధించారు. అస్పృశ్యతను ఏ రూపంలో పాటించినా లేదా సమర్థించినా పార్లమెంటు చేసిన చట్టం ప్రకారం శిక్షార్హులు. దీన్ని అమలు చేయడానికి పార్లమెంటు అస్పృశ్యతా నేర చట్టం 1955 ని రూపొందించింది. తర్వాత కర్ణాటక హైకోర్టు తీర్పు (1974) ప్రకారం ఈ చట్టాన్ని సవరించి పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1976 గా మార్చారు. అయితే షెడ్యూల్డ్ కులాలు, తెగల హక్కులను సమర్థవంతంగా కాపాడటానికి, వారిపై జరిగే దాడులను అరికట్టడానికి 'అకృత్యాల నిరోధక చట్టం 1989' ని రూపొందించి, అమలు చేస్తున్నారు.**

### ప్రాథమిక హక్కులు - వర్గీకరణ

రాజ్యాంగంలో 14 నుంచి 18 వరకు ఉన్న నిబంధనలు సమానత్వపు హక్కును గురించి వివరిస్తాయి.

### నిబంధన 14

చట్టం ముందు అందరూ సమానులే, చట్టం మూలంగా అందరికి సమాన రక్షణ కల్పించాలి.

### నిబంధన 15

దీని ప్రకారం అయిదు రకాల వివక్షలపై నిషేధం విధించారు.

★ 15 (1) ప్రకారం రాజ్యం మతం, జాతి, కులం, లింగ, జన్మస్థలం ఆధారంగా వివక్ష చూపకూడదు. (వయసు, విద్య, నివాసం, భాషా పరిజ్ఞానం మొదలైన అంశాల ఆధారంగా వివక్ష పాటించవచ్చు).

★ 15 (2) (a) ప్రకారం దుకాణాలు, పబ్లిక్ రెస్టారెంట్లు, హోటళ్లు, బహిరంగ వినోద ప్రదేశాలు (సినిమా హాళ్లు) మొదలైన ప్రదేశాల్లో పైన తెలిపిన 5 రకాల వివక్షలను పాటించకూడదు.

★ 15 (2) (b) ప్రకారం ప్రభుత్వ ధనంతో పూర్తిగా లేదా పాక్షికంగా లేదా ప్రజలందరి ఉపయోగం కోసం నిర్దేశించిన బావులు, చెరువులు, స్నానఘట్టాలు, రోడ్లు, బహిరంగ విహార ప్రదేశాల్లో పైన తెలిపిన 5 రకాల వివక్షలను చూపకూడదు.

★ 15 (3) ప్రకారం 'స్త్రీలు, శిశువుల' సంక్షేమం కోసం ప్రత్యేక సదుపాయాలను చట్టరీత్యా కల్పించవచ్చు లేదా నిషేధించవచ్చు. ఉదాహరణకు నర్సు ఉద్యోగాల్లో స్త్రీలకు ఎక్కువ అవకాశాలు కల్పించవచ్చు.

★ 15 (4) ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు లేదా షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధి కోసం ప్రత్యేక సౌకర్యాలు, మినహాయింపులు కల్పించవచ్చు. (దీన్ని 1951 లో మొదటి రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు).

★ 15 (5) ప్రకారం మైనారిటీ సంస్థలు మినహా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలన్నింటిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు లేదా షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధికి ప్రత్యేక మినహాయింపులు లేదా సదుపాయాలు కల్పించవచ్చు (2005 లో 93 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు.)

### నిబంధన 16

ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశం.

★ 16 (1) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.

★ 16 (2) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో మతం, జాతి, కులం, లింగ, వంశం, జన్మస్థలం లేదా పుట్టిన ప్రదేశం, నివాసస్థానం అనే 7 ప్రాతిపదికలపై పౌరుల పట్ల వివక్ష చూపకూడదు.

★ 16 (3) ప్రకారం కొన్ని ప్రాంతాల్లోని ప్రత్యేక సమస్యల దృష్ట్యా పార్లమెంటు కొన్ని ఉద్యోగాలను ఆ ప్రాంతం వారికే పరిమితం చేసి, ఇతర ప్రాంతాలవారు ఆ ఉద్యోగాలకు అనర్హులని చట్టరీత్యా ప్రకటించవచ్చు. ఉదాహరణకు ప్రభుత్వ ఉద్యోగాల నివాస అర్హతల చట్టం 1957.

★ 16 (4) ప్రకారం వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం భావించినట్లయితే వారికోసం కొన్ని ఉద్యోగాలను రిజర్వ్ చేస్తూ, నియమ నిబంధనలను రూపొందించవచ్చు.

★ 16 (4) (A) ప్రభుత్వ ఉద్యోగాలు, పదోన్నతుల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు కల్పించవచ్చు (దీన్ని 1995లో 77వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు).

★ 16 (4) (B) ఒక సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు కేటాయించిన రిజర్వేషన్ల కోటా భర్తీ కాకపోయినప్పటికీ, భర్తీకాని ఖాళీలను తర్వాతి సంవత్సరాల్లో రిజర్వేషన్ల కోటాలో కలుపుతారు. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించాయా లేదా అనే అంశాన్ని నిర్ధారించడంలో గత సంవత్సరాల్లో మిగిలిపోయి, కలిపిన వాటిని పరిగణనలోకి తీసుకోరాదు (దీన్ని 81 వ రాజ్యాంగ సవరణ చట్టం 2000 ద్వారా చేర్చారు).

★ 16 (5) ప్రభుత్వంలో ఏదైనా ఒక శాఖలో అంశాలు పూర్తిగా ఒక మత విశ్వాసానికి సంబంధినవి అయితే ఆ శాఖలో కేవలం ఆ మత విశ్వాసాలకు చెందినవారిని మాత్రమే నియమించేందుకు ప్రభుత్వం తగిన చట్టాలను రూపొందించవచ్చు. ఉదాహరణకు దేవాదాయ, ధర్మాదాయ శాఖలో పదవులకు హిందువులు, వక్ఫ్ బోర్డులో ముస్లింలు మాత్రమే అర్హులు.

**నిబంధన 18**

ఇది బిరుదుల నిషేధానికి సంబంధించిన నిబంధన.

★ 18 (1) ప్రకారం సైనిక, విద్యాపరమైన బిరుదులు మినహా ఇతర బిరుదులు స్వీకరించడాన్ని నిషేధించారు.

★ 18 (2) ప్రకారం భారత పౌరులు విదేశీ బిరుదులను స్వీకరించకూడదు.

★ 18 (3) ప్రకారం భారత పౌరులు కానప్పటికీ భారత ప్రభుత్వం ద్వారా ఆదాయం వచ్చే ఉద్యోగాన్ని లేదా పదవిని నిర్వహిస్తున్న సమయంలో రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాలు ఇచ్చే బిరుదులు స్వీకరించరాదు.

★ 18 (4) ప్రకారం లాభదాయక పదవిని నిర్వహిస్తున్న వ్యక్తి రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బహుమతులు, భత్యం, ఉద్యోగం లేదా పదవిని స్వీకరించరాదు.

★ 1954 నుంచి భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ లాంటి పురస్కారాలను రాష్ట్రపతి జారీచేసిన నోటీసు ద్వారా ప్రదానం చేస్తున్నారు.

**స్వేచ్ఛా హక్కు (నిబంధనలు 19 – 22)**

ప్రాథమిక హక్కులన్నింటిలో ప్రధానమైంది స్వేచ్ఛా హక్కు.

★ 19 (1) ప్రకారం 6 రకాల స్వేచ్ఛలు లేదా హక్కులున్నాయి. అవి:

★ 19 (1) (a): వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ.

★ 19 (1) (b): శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సమావేశాలను జరుపుకునే స్వేచ్ఛ.

★ 19 (1) (c): సంస్థలు లేదా సంఘాలు లేదా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ.

★ 19 (1) (d): దేశంలో ఏ ప్రాంతంలో అయినా సంచరించే స్వేచ్ఛ.

★ 19 (1) (e): భారతదేశంలో ఎక్కడైనా నివసించడానికి, స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడానికి స్వేచ్ఛ.

★ 1978 లో చేసిన 44వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం 19 (1) (f) ను తొలగించారు.

★ 19 (1) (g): నచ్చిన వృత్తి, వ్యాపారం, వాణిజ్యం చేసుకునే స్వేచ్ఛ.

★ 19 (2) ప్రకారం 19 (1) (a)లో చెప్పిన అంశాలు కింది పరిమితులకు లోబడి మాత్రమే పని చేస్తాయి.

అవి: భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతలను కాపాడటం, దేశ భద్రత, విదేశాలతో సంబంధాలు, శాంతి భద్రతలు, నైతిక విలువలు, సభ్యత, కోర్టు ధిక్కారం, పరువు నష్టం, నేరాలను చేయడానికి ప్రోత్సహించడం మొదలైన అంశాలకు సంబంధించి పరిమితులను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

★ 19 (3) ప్రకారం 19 (1) (b) లోని అంశాలు భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతల పరిరక్షణ దృష్ట్యా లేదా శాంతి భద్రతల దృష్ట్యా హేతుబద్ధమైన పరిమితులకు లోబడి మాత్రమే వర్తిస్తాయి.

★ 19 (4) ప్రకారం 19 (1) (c) లోని అంశాలపై కింది అంశాల దృష్ట్యా పరిమితులు విధించవచ్చు. అవి: భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతల పరిరక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ, నైతిక విలువల దృష్ట్యా హేతుబద్ధమైన ఆంక్షలను విధిస్తారు.

★ 19 (5) ప్రకారం 19 (1) (d) & (e) ల్లోని అంశాలపై ప్రజా సంక్షేమం దృష్ట్యా లేదా షెడ్యూల్డ్ తెగల హక్కుల సంరక్షణ దృష్ట్యా హేతుబద్ధమైన పరిమితులను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

★ 19 (6) ప్రకారం 19 (1) (g) లోని అంశాలపై హేతుబద్ధమైన ఆంక్షలను ప్రభుత్వం విధించగలదు.

(i) వృత్తిపరమైన, సాంకేతిక అర్హతలతో కలిసి ఉన్న వృత్తి వ్యాపారాలు లేదా

(ii) ప్రభుత్వం లేదా కార్పొరేషన్లకు చెందిన లేదా వాటి నియంత్రణలోని వ్యాపారం, పరిశ్రమలు, సేవారంగాలను ప్రజలు చేపట్టకుండా పూర్తిగా లేదా పాక్షికంగా నిషేధించడానికి సంబంధించిన శాసనాధికారం ప్రభుత్వానికి ఉంది.

**నిబంధన 20**

నేరం - శిక్ష నుంచి రక్షణ పొందే హక్కు.

★ 20 (1): నేరం జరిగిన సమయంలో చట్టరీత్యా అది నేరమైతే తప్ప, ఏ వ్యక్తిని శిక్షించరాదు.

★ అమల్లో ఉన్న చట్టం నిర్దేశించిన దానికంటే ఎక్కువ శిక్షను విధించకూడదు.

★ 20 (2): ఒక నేరానికి, ఒక కారణంపై ఒకటి కంటే ఎక్కువ సార్లు విచారణ, శిక్ష విధించకూడదు.

★ 20 (3): నిందితుడిని అతడికి వ్యతిరేకంగా అతడినే సాక్ష్యం చెప్పమని బలవంతం చేయరాదు.

**నిబంధన 21**

వ్యక్తి ప్రాణానికి, స్వేచ్ఛకు రక్షణ.

★ చట్టం నిర్ధారించిన పద్ధతిలో తప్ప మరేవిధంగాను వ్యక్తి ప్రాణానికి, స్వేచ్ఛకు హాని కలిగించరాదు.

**నిబంధన 21 (A)**

6 నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం చట్టాన్ని రూపొందించుకోవాలి (దీన్ని 2002 లో 86 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు).

**నిబంధన 22**

అరెస్టు, నిర్బంధం నుంచి రక్షణ.

★ 22 (1): అరెస్టు అయిన వ్యక్తికి, కారణాన్ని తెలియజేయాలి. న్యాయవాది సలహాను పొందడానికి, న్యాయస్థానంలో తన తరపున (నిందితుడి తరపున) వాదించడానికి (స్వయంగా/ న్యాయవాది) నిందితుడికి ఉన్న హక్కును నిరాకరించరాదు.

★ 22 (2): వ్యక్తిని అరెస్టు చేసిన సమయం నుంచి (ప్రయాణ సమయాన్ని మినహాయించి) 24 గంటల్లోపు సమీప న్యాయస్థానంలో (నిందితుడిని) హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా 24 గంటలకు మించి నిర్బంధంలో ఉంచరాదు (ఒకవేళ 24 గంటల్లోపు హాజరుపరచలేకపోతే, నిందితుడు విడుదలయ్యే హక్కును కలిగి ఉంటాడు).

★ 22 (3) ప్రకారం 22 (1), 22 (2) లోని నియమాలు కింది సందర్భాల్లో వర్తించవు.

(a) అరెస్టు అయిన వ్యక్తి శత్రు దేశానికి చెందిన వాడైనప్పుడు.

(b) నివారక నిర్బంధ చట్టం కింద అరెస్టు లేదా బంధితుడైనప్పుడు.

★ 22 (4) ప్రకారం నివారక నిర్బంధ చట్టం (P.D. Act) కింద అరెస్టు చేసినవారిని 3 నెలలకు మించి కింది సందర్భాల్లో తప్ప నిర్బంధంలో ఉంచరాదు.

a. హైకోర్టు న్యాయమూర్తులు లేదా హైకోర్టు న్యాయమూర్తిగా నియామకానికి అర్హత ఉన్న వ్యక్తులతో ఏర్పాటైన సలహా సంఘం సూచన మేరకు 3 నెలలకు మించి కూడా నిర్బంధంలో ఉంచవచ్చు.

b. పార్లమెంటు కొన్ని కేసులకు సంబంధించి నివారక నిర్బంధం కింద ఒక వ్యక్తిని 3 నెలలకు మించి ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచడానికి గరిష్ఠ కాలపరిమితిని సూచిస్తూ, ఏదైనా శాసనం చేసినప్పుడు కూడా ఉంచవచ్చు.

★ 22 (5) నివారక నిర్బంధం లేదా ప్రివెంటివ్ డిటెన్షన్‌కు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు, ఆ అరెస్టుకు సంబంధించిన కారణాలను ఆ వ్యక్తికి సాధ్యమైనంత త్వరగా తెలియజేయాలి. అరెస్టుకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై పిటిషన్ వేసే అవకాశాన్ని కూడా వారికి కల్పించాలి.

★ 22 (6) ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని 22 (5) నిబంధనలో తెలిపిన విధంగా అరెస్టుకు కారణాలను తెలియజేయాలన్న నిబంధనను పాటించకుండా, నిర్బంధానికి కారణాలను వెల్లడించకుండా ఉండే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

★ 22 (7) (a) ప్రకారం 22 (4) లో పేర్కొన్న విధంగా సలహా సంఘం అభిప్రాయంతో నిమిత్తం లేకుండా 3 నెలల కంటే ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచడానికి అవకాశం కల్పిస్తూ పార్లమెంట్ శాసనాలు చేయవచ్చు.

★ 22 (7) (b) ప్రకారం కొన్ని రకాల కేసుల విషయంలో గరిష్ఠ నివారక నిర్బంధ కాలపరిమితిని నిర్ణయిస్తూ పార్లమెంట్ శాసనాలు చేయవచ్చు.

★ 22 (7) (c) ప్రకారం 22 (4) లో పేర్కొన్న సలహా సంఘం విచారణ చేయాల్సిన విధానాన్ని నిర్దేశిస్తూ శాసనాలు చేయవచ్చు. (నివారక నిర్బంధ చట్టాల శాసనాధికార పరిధిని రాజ్యాంగం నిర్ణయించింది. దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలకు సంబంధించి పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉంటుంది. రాష్ట్రాల్లో శాంతి భద్రతలు, ప్రజా శ్రేయస్సు, నిత్యావసర వస్తుసేవలకు సంబంధించిన శాసనాధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉమ్మడిగా ఉంటుంది).

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**

www.eenadupratibha.net